


సకాలంలో యుద్ధ సామగ్రి అందించాం

● మాజీ హవాల్దార్ సంజీవనాయుడు



బొబ్బిలిరూరల్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్-బంగ్లాదేశ్-ఇండియా యుద్ధ సమయంలో జవాన్‌లకు సకాలంలో యుద్ధ సామగ్రి అందించేవారమని ఢాకా యూనిట్‌లో హవాల్దార్‌గా ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో విధులు నిర్వహించిన మరడ సంజీవనాయుడు తెలిపారు. ఆ యుద్ధంలో అనుభవాలను 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. బొబ్బిలి మండలం దిబ్బగుడ్డివలస గ్రామంలో ప్రస్తుతం నివాసం ఉంటున్నారు. 1964 సంవత్సరంలో భారత సైన్యంలో ఆర్మీ సప్లై కోర్ (ఏఎస్‌సీ)లో సిపాయిగా చేరారు. బెంగళూరు (కర్ణాటక)లో శిక్షణ పొందరు. డ్రైవర్‌గా విధులు నిర్వహించేవారు. ఈయనకు ఆరు అవార్డులు వచ్చాయి. రక్షా మెడల్, తొమ్మిదేళ్ల లాంగ్ సర్వీస్ మెడల్, రెండు సైన్య సేవా మెడల్స్, సంగ్రామ్ మెడల్, 25 ఏళ్ల స్వాతంత్రోత్సవ మెడల్ అందుకున్నారు. యుద్ధంలో పాల్గొన్న మన జవాన్లకు రేషన్, వాటర్, అమ్యూనిషన్ (బుల్లెట్‌లు), యుద్ధ సామగ్రి ఏఎస్‌సీ బటాలియన్ ద్వారా యుద్ధ క్షేత్రానికి చేర్చేవారమని, అక్కడ ఏ సమస్య వచ్చినా వారికి ట్రాన్స్‌పోర్ట్‌ను వెంటనే ఏర్పాటు చేసేవారమని సంజీవనాయుడు చెప్పారు.

సూపర్ గన్స్ దూసుకెళ్లేవి

● 30 కి.మీ రేంజ్‌లో శత్రువులను మట్టుబెట్టేవి
● తక్కువ సైన్యం ఉన్నా నలువైపులా చుట్టేసేవాళ్లం
● పాకిస్తాన్‌తో యుద్ధంలో అనుభవాలు వెల్లడించిన మాజీ సైనికుడు అప్పన్న
● నేడు విజయదివస్



మాజీ హవల్దార్ బెవర అప్పన్న

బొబ్బిలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'పారాఫీల్డ్ రెజిమెంట్‌లో వైర్‌లెస్ ఆపరేటర్ (ఆర్టలరీ)గా రూ.58 జీతంతో ఆర్మీలో చేరాను. ఆ సమయంలో జమ్మూ-కాశ్మీర్ ఉరి సెక్టార్‌లో వైర్ లెస్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించాను. మా యూనిట్‌లో సూపర్ గన్స్ ఉండేవి. ఆ గన్స్ 30 కిమీ రేంజ్‌లో శత్రువులను ఎదుర్కొనేవి' అంటూ మాజీ సైనికుడు బెవర అప్పన్న తన అనుభవాలను తెలిపారు. 1971లో పాకిస్తాన్‌తో యుద్ధం జరిగిన తీరును 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. మన దేశం ఇంటిలిజెన్స్ విభాగం పక్కాగా సందేశాలను ఇస్తుండేదని చెప్పారు. మన సైన్యం వారి కన్నా తక్కువ సంఖ్యలో ఉండేదని, అయినా ఆర్మీ కమాండర్ జనరల్ మానెక్ షా సరైన నిర్ణయాలు తీసుకోవడంతో మనం యుద్ధంలో విజయం సాధించగలిగామని వెల్లడించారు.

బొబ్బిలి మున్సిపాలిటీలోని అప్పయ్యపేటలో నివాసం ఉంటున్న బెవర అప్పన్న భారత సైన్యం ఆర్టిలరీ విభాగంలో 1961లో సిపాయిగా చేరారు. 17 ఫీల్డ్ రెజిమెంట్ నాసిక్ క్యాంప్ (మహారాష్ట్ర)లో శిక్షణ పొందారు. 1971 భారత్- పాకిస్తాన్ మధ్య యుద్ధం జరిగే సమయంలో బేటరీ హవల్దార్ మేజర్‌గా జమ్మూ-కాశ్మీర్ (సాంబ/ఉరి సెక్టర్‌లో) విధులు నిర్వహించారు. పారా జంపింగ్, ఫ్రీఫాల్ స్కైడైవింగ్‌లో కూడా శిక్షణ పొందారు. యుద్ధంలో అనుభవాలు ఆయన మాటల్లోనే..

● నాకు ఆరు అవార్డులు వచ్చాయి. రక్షా మెడల్, తొమ్మిదేళ్ల లాంగ్ సర్వీస్ మెడల్, రెండు సైన్య సేవా మెడల్స్, సంగ్రామ్ మెడల్, 25 ఏళ్ల స్వాతంత్రోత్సవ మెడల్ అందుకున్నాను. నాకు ముగ్గురు పిల్లలు. నా కుమారుడిని కూడా ఆర్మీలో చేర్పించాను. మాతృదేశం కోసం పరిశ్రమించడంలో వున్న తృప్తికి అవధుల్లేవు.

● మన సైన్యం తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ ఆ యుద్ధంలో సరైన వ్యూహాలు అమలు చేశాం. నాలుగు దిక్కుల్లో సైన్యం మోహరించాం. ఎక్కువ మంది ఉన్నట్లు లీఫ్‌లెట్స్ (మా సైన్యం నాలుగు దిశలలో ఆక్రమించి ఉంది. మీరు లొంగిపోండి లేదంటే ప్రాణాలతో విడిచిపెట్టం. అనుమానం ఉంటే ఉత్తర, దక్షిణ, పశ్చిమ, దిక్కులు చూడండి) ప్రణాళిక అమలు చేశాం. వాయు సేన హెలికాప్టర్లు కూడా నాలుగు దిక్కుల్లో విస్తరించి ఉండేవి. మన సైన్యం నాలుగు వైపులా మన భూభాగంలోకి వారు రాకుండా రహదారులను బాంబులతో పేల్చేశాం. బ్రిడ్జిలు డ్యామేజ్ చేసి అన్ని దారులూ మూయించేశారు. వారికి ట్రాన్స్‌పోర్టు లేకుండా చేసేసారు.



● డిసెంబర్ 3 మొదలైన యుద్ధం 16వ తేదీన పాకిస్తాన్ ఓటమితో విరమించాం. అప్పటికి వారు సరెండర్ అయ్యారు. అయినప్పటికీ మన సైన్యం తక్కువగా ఉండడంతో ముందుగా వారి ఆయుధాలను కింద వేయమని ఆదేశాలు ఇచ్చాం. మన సైనికులు ఆ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాక పాకిస్తాన్ జనరల్ ఏఏకే నియాజీ, భారత సైన్యాధిపతి జగ్జీత్ సింగ్ అరోరాల మధ్య యుద్ధ విరమణ ఒప్పందాలు జరిగాయి. మనం విజయం సాధించాం. ఈరోజు నుంచే విజయ్‌దివస్‌గా జరుపుకుంటున్నాం.

● ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఆ యుద్ధం జరిగింది. సరైన కమాండ్ కంట్రోల్ ఇచ్చిన ఆర్మీ కమండర్ జనరల్ మానెక్ షాకు ఫీల్డ్ మార్షల్ పదవితో సత్కరించారు.

బంగ్లాదేశ్ విముక్తి కోసం 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీరోచిత పోరాటం చేసి భారత్ సాధించిన విజయంలో మన జిల్లా వారు కూడా ఉన్నారు. ఆ విజయానికి గుర్తుగా డిసెంబరు 16ను విజయదివస్‌గా పాటిస్తున్నాం. ఈ నేపథ్యంలో ఆ వీర సైనికులు అప్పటి అనుభవాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.



వైభవంగా గోదారంగనాయకుల తిరువీధి

● నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

బొబ్బిలి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): క్రోధి నామ సంవత్సర మార్గశిర శుద్ధ పాడ్యమిని పురస్కరించుకుని బొబ్బిలి కంచరవీధి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదారంగ నాయకుల తిరువీధి ఉత్సవం ఆదివారం కన్నులపండువగా జరిగింది. ఈ నెల 16 నుంచి పుష్యమాస పౌర్ణమి (వచ్చే ఏడాది జనవరి 13) వరకు జరగనున్న ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా ఈ తిరువీధి నిర్వహించారు. ఇకనుంచి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ నెల 28న పూలంగి సేవ, 29న తులాభారం, వచ్చే ఏడాది జనవరి మూడున దీప వైభవం, 8న పొన్నాకుల హారతి, వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం, 11న కూడా రైవెల్లుం (విశేష ప్రసాద సేవ) కార్యక్రమాలను నిర్వహిస్తారు. జనవరి 13న గోదా రంగనాథస్వామి వారి దివ్యకల్యాణం నిర్వహించనున్నట్టు కమిటీ తెలిపింది.



గోదా రంగనాయకమ్మల తిరువీధి

పైడిమాంబ ఆలయ విస్తరణకు సహకారం

● దేవదాయశాఖ మంత్రి ఆనం

విజయనగరం రూరల్, డిసెంబరు 15: పైడిమాంబ ఆలయ విస్తరణ పనులకు ప్రభుత్వం పరంగా సహకారం అందిస్తామని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం విశాఖ వచ్చిన ఆయనను కేంద్రమాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజులు కలిశారు. ఈ సందర్భంగా పైడిమాంబ దేవస్థానం విస్తరణ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఆయన వద్ద ప్రస్తావించారు. వాటిని అధికారులు దేవదాయశాఖకు నివేదించారని, శాఖ అనుమతులు రావాల్సి ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ, పైడిమాంబ ఆలయ విస్తరణకు సంబంధించి ప్రభుత్వ పరంగా సహకరిస్తామన్నారు.



మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కేంద్ర మాజీమంత్రి అశోక్, ఎమ్మెల్యే అదితి

ఈ-దోపిడీ

● స్టాంపు లైసెన్స్‌దారుల ఇష్టారాజ్యం
● రెట్టింపు ధరకు విక్రయాలు
● జిల్లావ్యాప్తంగా అక్రమాలు
● ఏటా రూ.కోట్లలో అడ్డదారి సంపాదన



జిల్లాలో ఎలక్ట్రానిక్ (ఈ)స్టాంప్ వెండర్ల అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. వినియోగదారుల అవసరమే పెట్టుబడిగా కొన్నేళ్లుగా దోపిడీ పర్వం సాగిస్తున్నారు. స్టాంపు విలువపై 30 నుంచి మొదలై 50 శాతం వరకు అదనంగా గుంజుతున్నారు. వీరి నిర్వాకంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కోసారి డిమాండును చూసి వందశాతం అదనపు రేటుకు విక్రయిస్తుండడం వీరి బరితెగింపునకు పరాకాష్ట.

మెంటాడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం నాన్ జ్యుడీషయల్ స్టాంపుల సరఫరాను పరిమితం చేసి ఈ-స్టాంపులను తెరపైకి తెచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వానికి స్టాంపుల తయారీ ఖర్చు తగ్గడమే కాకుండా మెరుగైన సులభతరమైన సేవలు అందుబాటులోకి తెస్తున్నామని, రిజిస్ట్రేషన్‌లలో అక్రమాలకు చోటుండదని, పారదర్శకంగా ఉంటుందని చెప్పుకొచ్చింది. ఇకనుంచి వాటినే వినియోగించాలనంది. నాన్ జ్యుడీషియల్ స్టాంపులు పూర్తిస్థాయిలో అందు బాటులోకి వచ్చాక మళ్లీ వాటినే కొనసాగిస్తామని చెప్పింది. కా గా స్టాక్ హోల్డింగ్ కార్పొ రేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సంస్థకు ఈ- స్టాంపుల ఉత్పత్తి బాధ్యతను అప్పగించామని, ఏజెన్సీలు కావాల్సిన వారు ఆ సంస్థను సంప్రదించా లని ప్రకటించింది. అదే సమయంలో ఆ సంస్థ ఈ-స్టాంపుల విక్రయానికి ఏజెన్సీ కోసం ఔత్సాహికు లను ఆహ్వానించింది. ఈ క్రమం లో జిల్లాలో 155 ఈ-స్టాంపు విక్ర య కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వీటిలో 29 ప్రభుత్వ ప్రైవేటు రంగ బ్యాంకులు, 61 సీఎస్‌సీ సెంటర్లు, 31 వ్యక్తిగత కేంద్రాలతో పాటు 34 మంది స్టాంపు వెండర్లు వీటిని ఏర్పాటు చేసుకున్నారు.



ఈ-స్టాంప్స్



అంతులేని నిర్లక్ష్యం..

నాన్ జ్యుడీషియల్ స్టాంపు వెండర్లు ప్రభుత్వ రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ పరిధిలో ఉన్నందున వారిలో ఎంతోకొంత భయం ఉండేది. ఈ-స్టాంపు విక్రేతలు అనధికారికమైనందున అంతా మా ఇష్టం తరహాలో వ్యవహరిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇంత భారీ అక్రమాలు జరుగుతున్నా ఆ సంస్థ ప్రతినిధులు కిమ్మనకపోవడంతో వారి చిత్తశుద్ధిపై అను మానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ-స్టాంపు ఏజెన్సీ పొందిన అధికారిక స్టాంపు వెండర్లు సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుండగా, ఆ స్టాంపుల వ్యవహారంపై తమ పరిధిలోకి రాదని, తాము ఏమీ చేయలేమని ప్రభుత్వ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెప్పుకొస్తున్నారు. దీంతో అధికారిక స్టాంపువెండర్లు సైతం జంకుగొంకూ లేకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

దోచుకునోడికి దోచుకున్నంత..

ఈ 155 కేంద్రాల్లో బ్యాంక ర్లు మినహా మిగిలిన అన్ని చోట్ల విక్రయదారులు దోపిడీకి ఇంతకు మించిన సులువైన దారిలేదన్నట్టుగా బరితెగి స్తున్నారు. అందరూ కలిసి వినియోగదారులను నిలువుదోపిడీ చేస్తున్నారు. 20 రూపాయల స్టాంపు అడిగితే 50 రూపాయలు, 50 స్టాంపు అడిగితే వంద, 100 రూపాయల స్టాంపును 200కు ఇలా అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. వాదనకు దిగేవారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఈ- స్టాంపుల కోసం ప్రత్యేకంగా ప్రింటర్లు, కంప్యూటర్లు, సాఫ్ట్ వేర్ కోసం బోలెడు పెట్టుబడి పెట్టామని కథలు వినిపిస్తు న్నారు. అమ్ముడయ్యే స్టాంపుల సంఖ్యనుబట్టి జిల్లావ్యాప్తం గా నెలకు 30 లక్షల రూపాయల వరకు అక్రమాలు జరుగుతున్నట్టు ఓ అంచనా. సిండికేట్ తరహాలో స్టాంపుల కోసం కొనుగోలుదారులకు చుక్కలు చూపిస్తున్నారు.

డాక్యుమెంట్ రైటర్లు అవతారం...

నాన జ్యుడీషియల్ స్టాంపు వెండర్లు కొందరు... అనధికారికంగా డాక్యుమెంట్ రైటర్లు అవతారం ఎత్తుతున్నారు. ఎక్కువగా లావాదేవీలు జరిగే వాటి ఫార్మెట్‌లు డౌన్లోడ్ చేసుకొని ఖాళీలను పూరించేసి (మిగతా 8వ పేజీలో...)

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

● ఆయన త్యాగనిరతి అందరికీ తెలియాలి
● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని, ఆయన త్యాగనిరతిని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం పురస్కరించుకుని కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం సభ ఏర్పాటు చేశారు. తొలుత ఆయన చిత్రపటానికి మంత్రితో పాటుకలెక్టర్ అంబేడ్కర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని పోరాటం చేసి మనకు ప్రత్యేక గుర్తింపును తేవడానికి ప్రాణ త్యాగం చేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను, స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాలని, ప్రతి విద్యార్థి ఆయన జీవిత చరిత్రను తెలుసుకోవాలని చెప్పారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ మరణించి కూడా అమరజీవిగా నిలిచిపోయారంటే, ఆయన త్యాగం ఎంత గొప్పదో తెలుస్తోందని అన్నారు. కార్యక్ర మంలో డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, బీసీ సంక్షేమాధికారి పెంటోజీరావు, డీఈవో మాణిక్యంనాయుడు, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, డీపీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆటలతో ఒత్తిడి నుంచి ఉపశమనం

ఎస్పీ వకుల్‌జిందాల్

7లో



నమ్మకంగా ఉండి.. చోరీకి పాల్పడి

● 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు
● రాజాంలో చోరీ చేసిన బంగారం స్వాధీనం

పోలీసులు స్వాధీనం చేసుకున్న నగలు



7లో



కేసముద్రంలోని ఎంకే కన్వెన్షన్ ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

'తెలుగు' రాజకీయాలను శాసించేది కాపులే!

» పార్టీలు వేరైనా కాపులంతా కలిసికట్టుగా ఉండాలి: గంటా

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల రాజకీయాలను శాసించే శక్తి ఒక్క మున్నూరు కాపులకే ఉందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అమినాపురంలో మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఎంకే కన్వెన్షన్‌ను సంఘం అధ్యక్షుడు చందా గోపితో కలిసి గంటా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లోని కాపుల్లో రకరకాల పేర్లతో విభజించి ఐక్యతను దెబ్బతీయాలని చూస్తున్నారని, అన్ని రకాల కాపులు ఒక్కటేనని పేర్కొన్నారు. పార్టీలు వేరైనా మున్నూరుకాపులంతా కలిసికట్టుగా ఉండాలని సూచించారు. ఇక్కడి కన్వెన్షన్ హాల్‌కు రూ.5 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు.

జమిలి మంచిదే: కేంద్ర మంత్రి పెమ్మసాని

పెదకాకాని, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు పెట్టడం మంచిదేనని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. అయితే జమిలి ఎన్నికలకు ఇంకా సమయం ఉందని పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలోని వీవీఐటీ కళాశాల ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ విధంగా చెప్తే ఆ విధంగా నడుచుకుంటామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల కోసం పార్లమెంట్లో చట్టం చేయబోతోందని, దానిని అందరూ ఆమోదించాల్సి ఉందని చెప్పారు.

అల్లు అర్జున్‌కు జగన్ వత్తాసు నీచాతినీచం

» సీపీఐ రామకృష్ణ

అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్.. సినీ హీరో అల్లు అర్జున్‌కు వత్తాసుగా మాట్లాడటం నీచాతినీచమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఓట్ల కోసం రాజకీయ నేతలు సినిమా హీరోలకు ఊడిగం చేయడం సిగ్గుచేటన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'హైదరాబాద్ సంధ్య థియేటర్ ఘటనలో కనీస మానవత్వంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించకుండా రూ.వందల కోట్లు రెమ్యునరేషన్ తీసుకున్న సినిమా హీరోకి జగన్, బండి సంజయ్ వత్తాసు పలకడం సిగ్గుచేటు. పుష్ప-2 సినిమా టిక్కెట్ ధర రూ.1200లకు పెంచడం దారుణం. అని రామకృష్ణ వివరించారు.

వర్సిటీలకు వీసీలను నియమించండి

యూనివర్సిటీలకు వెంటనే వీసీలను నియమించాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం మంత్రి లోకేశ్‌కు లేఖ రాశారు. ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలైనా ఇంకా ఉన్నత విద్యామండలికి ఛైర్మన్‌ను నియమించలేదని పేర్కొన్నారు. 4,439 ప్రొఫెసర్ పోస్టుల భర్తీ మధ్యలోనే ఆగిపోయిందన్నారు.

అల్లుడూ ఎలా ఉన్నావ్?.. అర్జున్‌కు చిరంజీవి పలకరింపు

హైదరాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో శనివారం జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్.. తన మామ, సినీనటుడు చిరంజీవిని ఆదివారం కలిశారు. భార్య స్నేహారెడ్డి, పిల్లలు అయాన్, అర్హతో కలిసి ఆది వారం మధ్యాహ్నం చిరంజీవి నివాసానికి వెళ్లారు. మరో కారులో అల్లు అరవింద్ వారిని అనుసరించారు. కాగా, చాలాకాలం తర్వాత తమ ఇంటికి వచ్చిన అల్లు అర్జున్‌ను చిరంజీవి దంపతులు సాదరంగా ఆహ్వానించారు. 'అల్లుడూ ఎలా ఉన్నావ్' అని అడుగుతూ చిరంజీవి ఆలింగనం చేసుకున్నారు.

రాష్ట్రంలో సాహితీ పర్యాటకం..!

» తెలుగు భాష అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

» ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడి



విజయవాడలో జరగనున్న బుక్ ఫెస్టివల్‌కు రావాలని కోరుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆహ్వానం అందిస్తున్న బుక్ ఫెస్టివల్ ప్రతినిధులు

అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకం, చారిత్రక స్థలాల పర్యాటకం ఉన్న మాదిరిగానే సాహితీ పర్యాటకం కూడా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఆదివారమిక్కడ మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ కమిటీ ప్రతినిధులు ఆయన్ను కలిశారు. 35 ఏళ్ల నుంచి విజయవాడలో పుస్తక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెబుతూ అందుకు సంబంధించిన వివరాలను వారు తెలియజేశారు. కొన్నేళ్లుగా పుస్తక మహోత్సవం నిర్వహణకు అవసరమైన స్థలం లేక ఇబ్బందులుపడుతున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. శ్రీశ్రీ, గురజాడ, చలం, గుర్రం జాషువా, విశ్వనాథ సత్యనారాయణ, తిలక్, దేవులపల్లి కృష్ణశాస్త్రి లాంటి గొప్ప కవులు, రచయితల స్వస్థలాలు, అక్కడ వారి జ్ఞాపకాలను కాపాడడం.. వారి సాహిత్య సేవలు తెలిపే స్మారక కేంద్రాల నిర్మాణం వంటి వాటి ద్వారా ఆ ప్రాంతాలను అభివృద్ధి చేయవచ్చన్నారు. మాతృ భాషపై నవతరంలోనూ, చిన్నారుల్లోనూ ప్రేమాభిమానాలు పెంచడంతో పాటు మన కవులు, రచయితల గొప్పదనాన్ని తెలియజేసేలా తెలుగు సాహితీ యాత్రలు నిర్వహించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. 'వేటపాలెం గ్రంథాలయం, రాజమహేంద్రవరం గౌతమి గ్రంథాలయం, కడప సి.పి.బ్రౌన్ గ్రంథాలయం లాంటి ప్రముఖ గ్రంథాలయాలు ఏపీలో ఉన్నాయి. వీటిని, కవులు, రచయితల నివాసాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్స్ ఏర్పాటు చేయవచ్చు. ఈ అంశంపై భాషా, సాంస్కృతిక శాఖ, పర్యాటక శాఖ ప్రణాళికలు రూపొందించాలి' అని చెప్పారు. ఆయన్ను కలిసినవారిలో బుక్ ఫెస్టివల్ ప్రతినిధులు టి.మనోహర్ నాయుడు, కె.లక్ష్మయ్య, గొల్లనారాయణరావు, సాందీపని ఉన్నారు.

తప్పు నాదే.. క్షమించండి

» జర్నలిస్టు రంజిత్‌తో మోహన్ బాబు

» కొడుకు విష్ణుతో కలిసి ఆస్పత్రికి వెళ్లి పరామర్శ



రంజిత్ కుటుంబసభ్యులతో మంచు కుటుంబం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుపై దాడి ఘటనలో సినీనటుడు మోహన్ బాబు తన తప్పును అంగీకరించారు. బాధిత జర్నలిస్టు రంజిత్, అతని కుటుంబ సభ్యులకు స్వయంగా క్షమాపణలు చెప్పారు. జల్‌పల్లిలోని తన నివాసం వద్ద తాను చేసిన దాడిలో గాయపడి ఆస్పత్రిపాలైన జర్నలిస్టు రంజిత్‌ను మోహన్ బాబు ఆదివారం పరామర్శించారు. తన కుమారుడు మంచు విష్ణుతో కలిసి సోమాజీగూడలోని యశోద ఆస్పత్రికి ఆదివారం మధ్యాహ్నం వెళ్లిన ఆయన.. బాధిత జర్నలిస్టుకు క్షమాపణ చెప్పారు. రంజిత్ కుమార్తె, ఇతర కుటుంబసభ్యులకు కూడా క్షమాపణలు తెలియజేశారు. ఆ రోజు జరిగిన ఘటనకు తాను బాధపడుతున్నానని, అలా జరిగి ఉండాల్సింది కాదని, తప్పు తనదేనని రంజిత్‌తో అన్నారు. క్షమించమని అడగడం తప్ప.. ఏమీ మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నానని రంజిత్, అతని భార్యాపిల్లలకు వివరణ ఇచ్చుకున్నారు. అలాగే, రంజిత్ కుమార్తెను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ఎత్తుకున్నారు. సారీ తల్లి నా వల్లే మీ నాన్నకు ఈ పరిస్థితి వచ్చిందని ఆ చిన్నారితో అన్నారు. అనంతరం, రంజిత్, అతని కుటుంబసభ్యులతో మాట్లాడి.. రంజిత్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రెండు కాళ్లు, భుజాలు, కళ్లకు శస్త్రచికిత్స చేయించుకున్న తనకు... శస్త్రచికిత్సల బాధ ఎలా ఉంటుందో తెలుసునని ఈ సందర్భంగా వారితో అన్నారు. రంజిత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రంజిత్ కుటుంబానికి అండగా ఉంటానని, ఏ సాయం చేయడానికైనా సిద్ధమని హామీ ఇచ్చారు. సుమారు 15 నిమిషాల పాటు మోహన్‌బాబు.. జర్నలిస్టు రంజిత్ వద్ద ఉన్నారు.

విష్ణు అనుచరులతో ప్రాణహాని ఉంది

» జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్ పోశారు: మంచు మనోజ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంచు మోహన్‌బాబు కుటుంబంలో మరో వివాదం తెరపైకి వచ్చింది. అన్నదమ్ములు విష్ణు, మనోజ్ మధ్య మళ్లీ విభేదాలు భగ్గుమన్నాయి. జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్‌ను పోసి విద్యుత్తు సరఫరా నిలిపివేయడం ద్వారా విష్ణు అనుచరులు నన్ను, నా కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేశారని మంచు మనోజ్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం మీడియాకు ఓ లేఖ విడుదల చేశారు. "నన్ను, నా కుటుంబాన్ని మంచు విష్ణు, అతడి అనుచరులు పలు విధాలుగా భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. శనివారం నేను షూటింగ్‌కు వెళ్లగా.. నా భార్య కుమారుడి స్కూల్‌లో జరుగుతున్న కార్యక్రమానికి వెళ్లారు. మా అమ్మ పుట్టిన రోజు సందర్భంగా కేక్ ఇచ్చే నెపంతో మంచు విష్ణుతోపాటు అతడి అనుచరులు రాజ్ కందూరు, కిరణ్, విజయ్ రెడ్డితోపాటు కొంతమంది బౌన్సర్లు ఇంటికి వచ్చారు. ఈ సమయంలో వారు నా జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్ పోశారు. దీని కారణంగా కరెంట్ సరఫరాలో తీవ్ర అంతరాయంతోపాటు జనరేటర్ నుంచి నిప్పు రవ్వలు ఎగిసిపడ్డాయి. జనరేటర్‌కు సమీపంలోనే కార్లు, గ్యాస్‌కు సంబంధించిన కనెక్షన్లు ఉన్నాయి. ఒక వేళ నిప్పురవ్వల కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఉంటే ఇంట్లో ఉన్న నా 9 నెలల పాప, వృద్ధురాలైన నా తల్లి, అంకుల్, ఆంటీల ప్రాణాలకు ముప్పు ఏర్పడేది. మా అమ్మ పుట్టిన రోజున ఇలా జరగడం నా మనసును కలిచివేసింది. ఇది పూర్తిగా కుటుంబ సమస్య.. కానీ నా కుటుంబ క్షేమం, రక్షణ కోసం అన్ని అంశాలను బహిరంగపర్చాల్సి వస్తోంది. నేడు ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తా" అని పేర్కొన్నారు.

వెంటిలేటర్‌పైనే శ్రీతేజ

» బాలుడి కుటుంబానికి అల్లు అర్జున్ రూ.కోటి ఇవ్వాలి: మంద కృష్ణ

హైదరాబాద్, రాంగోపాల్‌పేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న శ్రీతేజకు ఇంకా వెంటిలేషపై ఉంచి చికిత్స అందిస్తున్నట్లు సికింద్రాబాద్‌లోని కిమ్స్ కడిల్స్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. శ్రీతేజకు అందిస్తున్న చికిత, అతడి ఆరోగ్యస్థితిపై ఆదివారం సాయంత్రం ఆస్పత్రి హెల్త్‌బులిటెన్ విడుదల చేసింది. ఆస్పత్రిలో బాబుకు పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ)లో చికిత్స కొనసాగుతోందని వైద్యులు చేతన్ ఆర్. ముందాడ, విష్ణు తేజ్ తెలిపారు. శ్రీతేజ వైటల్ పారామీటర్స్ స్థిరంగా ఉన్నాయని, ట్యూబ్ ద్వారా ఇచ్చే ఆహారం బాగానే తీసుకుంటున్నాడని పేర్కొన్నారు. జ్వరం వస్తోందని.. మెదడు, నాడి సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడని వివరించారు. నాడీ సంబంధిత ఆరోగ్య స్థితిని ఎప్పటపకప్పుడు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కాగా శ్రీతేజను పరామర్శించేందుకు ఆదివారం ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆస్పత్రికి వచ్చారు. అతడి ఆరోగ్యస్థితి గురించి వైద్యులను, బాలుడి తండ్రి భాస్కర్‌ను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. శ్రీతేజ కుటుంబానికి అల్లు అర్జున్ రూ.కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. శ్రీతేజను సినీ పరిశ్రమ, మా అసోసియేషన్ సభ్యులు కూడా ఆదుకోవాలని కోరారు. శ్రీతేజను పరామర్శించడానికి రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద, తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ బండ్రు శోభారాణి కూడా ఆస్పత్రికి వచ్చారు.



కిందపడిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల, ఇతర నేతలను పైకి లేవదీస్తున్న దృశ్యం

కౌడా ఛైర్మన్ ప్రమాణస్వీకారోత్సవంలో అపశ్రుతి

» ఎక్కువ మంది ఎక్కడంతో కూలిన వేదిక

» ఇద్దరు ఎమ్మెల్యేలు సహా పలువురికి స్వల్ప గాయాలు

సర్పవరం జంక్షన్ (కాకినాడ), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ(కౌడా) ఛైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఛైర్మన్‌గా జనసేన నేత తుమ్మల రామస్వామి(బాబు) ప్రమాణస్వీకారం చేయాల్సి ఉండగా.. వేదిక పైకి ఎక్కువ మంది ఎక్కడంతో అకస్మాత్తుగా అది కుప్పకూలింది. దీంతో స్టేజీపై ఉన్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ హరిప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, తుమ్మల రామస్వామితో సహా పలువురు కూటమి నాయకులు కింద పడిపోయారు. ఈ పరిణామంతో సభా ప్రాంగణంలో కొంత తొక్కిసలాట జరిగింది. పోలీసులు, భద్రతా సిబ్బంది, నాయకులు తేరుకుని కిందపడిన వారికి రక్షణ వలయంగా ఉండి.. పైకి లేపి సపర్యలు చేశారు. ఎమ్మెల్యే చినరాజప్ప కాలికి స్వల్ప గాయం కాగా, ఆయన సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లిపోయారు. యనమల ప్రమాణస్వీకారం వరకు ఉండకుండా మధ్యలోనే తన క్యాంపు కార్యాలయానికి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే నానాజీకి వీపు, తలకు దెబ్బలు తగిలాయి. అనంతరం నానాజీ అధ్యక్షతన మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా కౌడా ఛైర్మన్‌గా తుమ్మల రామస్వామితో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో కౌడా వైస్ ఛైర్‌పర్సన్, కమిషనర్ భావన, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మాజీ ఎమ్మెల్యే వర్మ, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నవ్య | చిత్రజ్యోతి

విడుదల తేదీ ఖరారు

క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క శెట్టి నటిస్తున్న 50వ చిత్రం 'ఘాటి'. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేసి సినిమాపై అంచనాలను పెంచేశారు.



ఆదివారం ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు మేకర్స్. సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 18న విడుదలవుతున్నట్లు ఓ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో అనుష్క లుక్‌ను ప్రజెంట్ చేస్తూ.. 'విక్టిమ్.. క్రిమినల్.. లెజెండ్' అని పేర్కొన్నారు. అనుకోని పరిస్థితుల్లో లోతైన సమస్యలో కూరుకుపోయిన ఓ మహిళ.. తనకు జరిగిన అన్యాయంపై పోరాడి ..వారిపై ప్రతీకారం తీర్చుకోవడమే కథాంశంగా ఈ సినిమా తెరకెక్కనుంది. కాగా, క్రిష్ దర్శకత్వంలో దాదాపు 14 ఏళ్ల తర్వాత అనుష్క నటిస్తుండటం విశేషం. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'వేదం' విమర్శకుల ప్రశంసలతో పాటు క్లాసికల్ హిట్ స్టేటస్‌ను సంపాదించుకుంది.



శివకార్తికేయన్‌తో శ్రీలీల

తమిళ హీరో శివకార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న నూతన చిత్రం ఖరారైంది. 'ఎస్‌కే 25' వర్కింగ్ టైటిల్. సుధాకొంగర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల కథానాయిక. జయం రవి, అథర్వ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఆకాశ్ భాస్కరన్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'శివకార్తికేయన్ ప్రతిభావంతుడైన నటుడు. ఆయనతో సినిమా చేసే అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉంది. భారీ బడ్జెట్‌తో గ్రాండ్‌గా నిర్మిస్తున్నాం' అని చెప్పారు. జీవీ ప్రకాశ్‌కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రవి కె. చంద్రన్.



బిగ్‌బాస్ సీజన్ 8 గెలుపుగుర్రం నిఖిల్

ఒక టీవీ షో.. ప్రతి సంవత్సరం దాదాపు మూడు నెలల పాటు ప్రేక్షకులు టీవీలకు అతుక్కుపోయేలా చేస్తోంది. కొన్ని సంవత్సరాలుగా ప్రేక్షకులకు అంతులేని వినోదంతో పాటు మరిచిపోలేని జ్ఞాపకాల్ని పంచిన ఆ షో బిగ్‌బాస్. గత ఏడు సీజన్‌లు అందించిన వినోదానికి ఏ మాత్రం తగ్గకుండా సెప్టెంబర్ 1న మొదలైంది తెలుగు బిగ్‌బాస్ సీజన్ 8. 105 రోజుల పాటు ఆసక్తికరమైన మలుపులతో ప్రేక్షకులను విశేషంగా అలరించి.. ఆదివారం జరిగిన గ్రాండ్ ఫినాలేతో ముగిసింది. బిగ్‌బాస్ సీజన్ 8 గేమ్ షో విజేత ఎవరో తెలిసిపోయింది. ఈ ఏడాది షో విన్నర్‌గా నిఖిల్‌ను వ్యాఖ్యాత నాగార్జున ప్రకటించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రామ్‌చరణ్.. విజేతకు ట్రోఫీతో పాటు రూ.55 లక్షల ప్రైజ్‌మనీ, మారుతీ సుజుకీ డాజ్లింగ్ డిజైర్ కారుని అందజేశారు. ఇప్పటివరకు జరిగిన అన్ని సీజన్ల కన్నా ఈ సీజన్ ప్రైజ్ మనీ ఎక్కువ కావడం విశేషం. విజేతకు చివరి వరకు గట్టి పోటీనిచ్చిన గౌతమ్‌కృష్ణ రన్నరప్‌గా మిగిలారు. టాప్ 5 కంటెస్టెంట్లుగా పోటీ చేసిన నబీల్, ప్రేరణ, అవినాశ్‌లకు ప్రేక్షకుల నుంచి వచ్చిన ఓట్ల ఆధారంగా వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాలు దక్కాయి. ఎలిమినేషన్ ప్రక్రియలో ఐదో స్థానంలో నిలిచిన అవినాశ్‌ను హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్ .. నాలుగో స్థానంలో ఉన్న ప్రేరణను కన్నడ స్టార్ ఉపేంద్ర.. మూడో స్థానంలో మిగిలిన నబీల్‌ను విజయ్ సేతుపతి, మంజు వారియర్ బయటకు తీసుకుని వచ్చారు.

నభానటేష్ స్టెప్పులు

ఈ ఏడాది గ్రాండ్ ఫినాలేలో హీరోయిన్ నభా నటేశ్ స్పెషల్ పర్ఫామెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. 'పుష్ప 2'లోని 'వస్తున్నాయ్ పీలింగ్స్' పాటతో పాటు మరికొన్ని సాంగ్స్‌కు స్టెప్పులేసి అలరించారు. పలువురు సినీతారలు తళుక్కుమనడం.. శ్రీకృష్ణ, గీతా మాధురి పాటల ప్రదర్శన... టాప్ 5 కంటెస్టెంట్స్ ఆటపాటలతో షో ఆకట్టుకుంది. నాగార్జున జరిపిన సరదా సంభాషణలు.. సీజన్ 8 హౌజ్‌ను చూపించి అందర్నీ గతంలోకి తీసుకెళ్లడం.. ఇలా ఫినాలే ఆరంభం నుంచి విన్నర్‌ని ప్రకటించేదాకా వరకు హౌజ్‌లో జరిగిన హంగామా అంతా ప్రేక్షకులకు వినోదాన్ని పంచింది.

పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

సీజన్ 7 ఫినాలే తర్వాత జరిగిన గొడవల్ని, అల్లర్లను దృష్టిలో పెట్టుకున్న పోలీసులు.. ఈ ఏడాది అలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 300 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. అభిమానులు ఎవ్వరూ స్టూడియోస్‌కు రావొద్దని.. విజేతను ప్రకటించాక ఊరేగింపులు, ర్యాలీలు చేయొద్దని పోలీసులు సూచించారు.



సినీ ఫైనాన్సియర్ బంగారు బాబు (ఈ.వి.రాజారెడ్డి) తనయుడు క్రాంతి రెడ్డి నిశ్చితార్థం పారిశ్రామికవేత్త సీతారామిరెడ్డి కుమార్తె శిరీషతో ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి గ్రూప్స్ అధినేత వేమూరి రాధాకృష్ణ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. అలాగే పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కథానాయిక కీర్తిసురేశ్ ఇటీవలే తన ప్రియుడు ఆంటోని తట్టిల్‌ను పెళ్లాడిన విషయం తెలిసిందే. తొలుత ఈ నెల 12న గోవాలో వీరి వివాహం హిందూ సంప్రదాయ పద్ధతిలో జరగ్గా, తర్వాత క్రైస్తవ సంప్రదాయాన్ని అనుసరించి వీరిద్దరూ ఒక్కటయ్యారు. ఆ ఫొటోలను కీర్తిసురేశ్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.

గర్వంగా ఉంది



వెట్రిమారన్ దర్శకత్వంలో విజయ్‌సేతుపతి నటించిన చిత్రం 'విడుదల 2'. గతేడాది రిలీజై విజయం సాధించిన 'విడుదల' పార్ట్ 1కు కొనసాగింపుగా ఇది తెరకెక్కింది. సూరి, మంజు వారియర్ కీలక పాత్రల్లో నటించారు. నిర్మాత చింతపల్లి రామారావు తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ నెల 20న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విజయ్‌సేతుపతి మాట్లాడుతూ "ఈ సినిమాలో నటించినందుకు ఎంతో గర్వంగా ఉంది. నా సినిమాల్ని ఇంతలా ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకుల సపోర్ట్‌కు మన స్ఫూర్తిగా కృతజ్ఞతలు. ఇళయరాజా అందించిన సంగీతం ఈ చిత్రానికి ప్రధానాకర్షణ. చిత్రం తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది" అని చెప్పారు. "ఈ సినిమా ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. ఇది తెలుగు నేటివిటీకి దగ్గరగా ఉన్న సినిమా" అని నిర్మాత చింతపల్లి రామారావు అన్నారు.



శరవేగంగా చిత్రీకరణ

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జీవిత విశేషాల ఆధారంగా దిలీప్ రాజా దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'బాబు జగ్జీవన్ రామ్'. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ప్రదీప్ దోనెపూడి. బాబు జగ్జీవన్ రామ్ పాత్రలో మిలటరీ ప్రసాద్ నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. హైదరాబాద్ ఫిల్మ్‌ఛాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం షూటింగ్ వివరాలను వివరించింది. చిత్రదర్శకుడు దిలీప్ రాజా మాట్లాడుతూ 'జగ్జీవన్ రామ్ సేవల గురించి ప్రేక్షకులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. జగ్జీవన్‌రామ్ వర్ధంతి అయిన జూలై 6న విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు.

అందరికీ నచ్చుతుంది



కేవీజీ రాజు దర్శకత్వంలో లోకేశ్ బాబు దాసరి, శిరీష హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'ఉల్లాసంగానే ఉత్సాహంగానే'. శ్రీ మైత్రీ క్రియేషన్స్ పతాకంపై యార్లగడ్డ ఉమామహేశ్వరరావు నిర్మిస్తున్నారు. ఎండీ కలామ్, ఖదీర్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు కేవీజీ రాజు మాట్లాడుతూ' ఈ చిత్రంలో లోకేశ్ ఎనర్జిటిక్‌గా నటించాడు. త్వరలో సాంగ్స్ ట్రైలర్ రిలీజ్ చేస్తాం' అని తెలిపారు. నిర్మాత ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ' ఒక మంచి లవ్ స్టోరీని తెరకెక్కించాం. మీ అందరికీ నచ్చుతుందని భావిస్తున్నా' అని అన్నారు.

లైంగికంగా వేధించాడు





బాలీవుడ్ సంగీత దర్శకుడు రాజేశ్ రోషన్ తనను లైంగికంగా వేధించారని గాయని లగ్నజితా చక్రబర్తి ఆరోపించారు. సంగీత చర్చల కోసం తన ఇంటికి పిలిచిన రాజేశ్ రోషన్ అసభ్యకరంగా తాకారని ఆమె చెప్పారు. ఓ ఇంటర్వ్యూలో లగ్నజితా మాట్లాడుతూ 'నేను ముంబైలో ఉన్న రోజుల్లో ఓ సారి రాజేశ్ రోషన్ పిలవడంతో వారి ఇంటికి వెళ్లాను. వాద్య పరికరాలతో నిండి ఉన్న గదిలోకి నన్ను తీసుకెళ్లి కూర్చోబెట్టారు. నాక్కొంచెం దూరంలో ఆయన కూర్చున్నారు. నేను ఫోన్ చూస్తుండగా, రాజేశ్ రోషన్ నెమ్మదిగా నా వైపు కదలడం గమనించాను. అతను ఏం చేస్తాడో చూద్దాం అని నేను గమనించనట్లే ఊరుకున్నాను. రాజేశ్ రోషన్ నా స్కర్ట్‌లోకి తన చేతులను దూర్చాడు. నేను వెంటనే తేరుకొని అక్కడ నుంచి బయటకు పరుగుతీశాను. జుగుప్సాకరమైన ఆ సంఘటన గురించి కెమెరా ముందు మాట్లాడలన్నా సిగ్గుగా ఉంది. మొదట దిగ్భ్రాంతికి గురయ్యాను. అయితే జరిగిన దాంట్లో నా తప్పేం లేదు, అతనిది దిగజారుడు వ్యక్తిత్వం అని అర్థం చేసుకొని, ఆ సంఘటన వల్ల క్షోభకు గురికాకుండా నన్ను నేను కాపాడుకున్నాను' అని తెలిపారు. లగ్నజితా ఆరోపణలపై రాజేశ్ రోషన్ స్పందించలేదు.

తలుపులు ఊడిపోయి.. కిటికీలు విరిగిపోయి

● ఏళ్ల తరబడి శిథిలావస్థకు చేరిన భవనంలో నిర్వహణ ● ఇదీ రామభద్రపురం ఎస్సీ బాలుర హాస్టల్ దుస్థితి



పాడైపోయిన తలుపు

రామభద్రపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రామభద్రపురంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో సమస్యలు పాగా వేశాయి. ప్రధానంగా ఐదు దశాబ్దాల కిందట నిర్మించిన భవనం కావడంతో పూర్తిగాశిథిలావస్థకు చేరింది. తలుపులు ఊడిపోవడంతో పాటు కిటికీలు విరిగిపోయాయి. 1975లో నిర్మించిన ఈ హాస్టల్‌లో మూడు నుంచి పదోతరగతి వరకు 70 మంది ఇక్కడ చదువుతున్నారు. భవనంలో విద్యార్థులు ఉంటున్న గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమని కాలం వెళ్లదీస్తున్నారు.50ఏళ్లు గడిచినా ఈభవనంలోనే నెట్టుకొస్తున్నారు.పైకప్పునుంచి పెచ్చులూడిపడుతుండడంతోఇటీవల సున్నం రాసి చేతులు దులుపుకొన్నారు. కిటికీలు పాడవడంతో పాములు, విషసర్పాలు వస్తున్నాయని, చలిగాలులకు తట్టుకోలేక పోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. హాస్టల్ బాతురూముల నిర్వహణలేకపోవడంతో ట్యాపులు తలుపులు పాడవడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. కాగా కొత్త భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని వార్డెన్ వెంకటరావు తెలిపారు.



శిథిలావస్థకు చేరిన ఎస్సీ బాలుర వసతి గృహం

పరదాలు లేక.. పంటను రక్షించుకోలేక

●రాయితీపై అందించని ప్రభుత్వం● ఆందోళన చెందుతున్నరైతులు● ఇదీ వంగర మండలంలో పరిస్థితి

వంగర, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి):అన్నదాతకు పంటచేతికొచ్చే వరకూ అగచాట్లు తప్పడంలేదు. ఏటా పంట కోత సమయంలో తుఫాన్లు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో ఆ సమయంలో పంటను రక్షించుకోవడానికి అవసరమైన పరదాలు సగానికిపైగా రైతుల వద్దలేవు. గత వైసీపీ ప్రభుత్వం రాయితీపై అందించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు.

మండలంలోఎనిమిది వేల హెక్టార్లల్లో సాగుచేస్తున్నారు.ఈమేరకు రైతులకు పదివేల పరదాలు అవసరం. ప్రస్తుతం గతంలో టీడీపీ ప్రభుత్వం పంపిణీచేసినవి సైతం పాడయ్యాయి. సుమారు అప్పట్లో ఎనిమిది వేల మందికి అందజేశారు. రూ.2,800 విలువ చేసే ఒక్కో పరదాను రూ.1,800కు అందజేశారు. ప్రస్తుతం మార్కెట్లో రూ.3,500 ధర పలుకుతోంది. ఏటా ఖరీఫ్‌లో అక్టోబరు, నవంబరులో పంటచేతికొచ్చే సమయంలో బంగాళాఖాతంలో తుఫాన్లు రైతులు ఆందోళనకు గురిచేస్తున్నాయి.అటువంటి సమయంలో పంటలు రైతులు కాపాడుకోవడానికి రైతులు వద్ద పరదాలులేక ఇబ్బంది పడుతున్నారు.ఈనేపథ్యంలో రైతులుపంటను రక్షించుకోలేక తక్కువ ధరక విక్రయించాల్సివస్తోంది. దీనికితోడు తేమ శాతం 17శాతానికి మించకుండా ఉంటేనే ధాన్యంకొనుగోలు కేంద్రాల్లో విక్రయించడానికి అవకావముంది. ఎకరాధాన్యం ఆరబెట్టడానికి రోజుకు ఐదుపరదాలు చొప్పున్న ఐదురోజులు అవసరం. అయితే పరదాకు రోజుకు రూ.50 చొప్పున్న 250 వరకు ఖర్చువుతోంది. దీంతో రైతులు ఆభారం తట్టుకోలేక తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. కాగా మార్కెట్లో పరదాల ధరఎక్కువగా ఉండడంతో రాయితీపై అందించాలని పటువర్ధనం రైతు నల్లా సూర్యం తదితరులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

కలెక్టర్ ఇటీవల నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో పరదాల పంపిణీకి ఆదేశాలిచ్చారని వంగర మండల వ్యవసాయాధికారి కన్నబాబు తెలిపారు. దీంతో ప్రభుత్వానికి నివేదించామని చెప్పారు. మండలంలో 10 వేల వరకు పరదాలు అవసరమని తెలిపారు.



మగ్గూరులో పరదాలు లేక బస్తాలపై గడ్డి కప్పిన రైతులు

కొత్తపాలెంలో ఒకరి ఆత్మహత్య

బొండపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెంలో భార్యాభర్తల మధ్య తలెత్తిన మనస్పర్థల వల్ల మనస్థాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ యు.మహేష్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన పొట్నూరు అప్పారావు (42) తన భార్యతో శనివారం రాత్రి గొడవపడ్డాడు. ఆ సమయంలో ఇద్దరు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మనస్థాపానికి గురై ఆదివారం వేకువజామున అప్పారావు ఇంట్లో ఉరివేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేయగా మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ ఒకరు..

బొబ్బిలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలంలోని మెట్టవలస గ్రామానికి చెందిన పెదప్రోలు జగదీశ్వరరావు(45) పురుగు మందు తాగి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. సీఐ కటకం సతీష్ కుమార్ కథనంప్రకారం.. జగదీశ్వరరావు స్థానిక హీరాకంపెనీలో లేబర్‌గా పని చేస్తున్నారు. మద్యానికి బానిసకావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో ఆయన శనివారం తన ఇంట్లో పురుగు మందుల తాగారు. గమనించిన కుటుంబసభ్యులు బొబ్బిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.ప్రతమచికిత్స అనంతరం విజయనగరం ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ జగదీశ్వరరావు ఆదివారం మృతిచెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య లావణ్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.లావణ్యఫిర్యాదుమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సాలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు. సీఐ కథనం మేరకు.. రాయ్‌పూర్ హైవే వైపు దుగ్గసాగరం సమీపంలో ఓ దివ్యాంగుడి మృతదేహం కనిపించిందని చెప్పారు. సుమారు 45 సంవత్సరాలు వయస్సు ఉంటుందని తెలిపారు. చారలుగల టీషర్టు, నైట్ ట్రాక్ ప్యాంటు ధరించి ఉన్నాడని, అతని వద్ద ఒక గోనె సంచి ఉందని, అందులో గుడ్డలు, ఖాళీ ప్లాస్టిక్ గాజు సీసాలు ఉన్నాయని ఆయన వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నామని తెలిపారు.

నమ్మకంగా ఉండి.. చోరీకి పాల్పడి

● 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు
● రాజాంలో చోరీ చేసిన బంగారం స్వాధీనం

రాజాం రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఈశ్వర నారాయణ కాలనీ రెండోలైన్‌లో ఈనెల 13న జరిగిన బంగారం చోరీ కేసును రాజాం పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన సుమారు 13 తులాల బంగారాన్ని నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆదివారం రాజాం రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ ఉపేంద్రరావు విలేకరులతో మాట్లాడారు. సీఐ కథనం మేరకు.. పట్టణంలోని ఈశ్వరనారాయణ కాలనీ రెండోలైన్‌లో నివాసముంటున్న అమరాపు సత్యనారాయణ బజార్‌రోడ్‌లో కిరాణా వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఆయనవద్ద ఏడాది కిందట పట్టణానికి చెందిన చిప్పాడ అరుణ్‌కుమార్ పనికోసం చేరాడు. నమ్మకంగా పనిచేసే అరుణ్‌కుమార్‌కు వ్యాపార పనులతో పాటు ఇంటి పనులు కూడా చెబుతూ వస్తున్నాడు. దీంతో సత్యనారాయణ ఇంటి పరిస్థితితో పాటు ఆర్థిక పరిస్థితిపై అరుణ్‌కుమార్ అవగాహన పెంచుకున్నాడు. అప్పటికే వ్యసనాల బారినపడి అప్పులపాలైన అరుణ్‌కుమార్ ఆర్థికంగా స్థితిమంతుడైన సత్యనారాయణ ఇంట్లో చోరీ చేయాలని నిర్ధారణకొచ్చాడు.సత్యనారాయణ ఆయన భార్య షాపులో ఉండే సమయాన్ని ఆసరాగా తీసుకున్నాడు. ఈనెల 13న తన ఇంటికి భోజనానికి వెళ్తానని చెప్పి నేరుగా సత్యనారాయణ ఇంటికి వెళ్లాడు. చెప్పుల స్టాండ్‌లో ఉన్న ఇంటి తాళాన్ని తీసి బెడ్‌రూంలో ఉన్న బీరువాను బ్రేక్ చేసి అందులో ఉన్న బంగారు ఆభరణాల బాక్స్‌ను అపహరించి తనవెంట ఇంటికి తీసుకువెళ్లి ఇంట్లో భద్రపరిచి ఏమీ తెలియనట్లుగా షాపునకు చేరుకున్నాడు.షాపు నుంచి సాయంత్రం ఇంటికి సత్యనారాయణ భార్య ఇంటికి చేరింది. తలుపులు తెరిచి ఉండడంతో పాటు బెడ్‌రూములో బీరువా తెరిచి ఉంది. బట్టలన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి.అనుమానం వచ్చి తన భర్తకు సమాచారం అందించింది. పరిశీలించిన అనరంతరం ఇంట్లో దొంగతనం జరిగిందని నిర్ధారణకు వచ్చారు. సత్యానారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజాం సీఐ ఉపేంద్రరావు సూచనల మేరకు ఎస్ఐ రవికిరణ్ రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించారు. షాపులో పని చేస్తున్న అరుణ్‌కుమార్ కదలికలపై అనుమానం వచ్చిన రవికిరణ్ ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. దీంతో చోరీ చేసినట్లు అరుణ్‌కుమార్ అంగీకరించడంతో ఆయన్ను అరెస్ట్ చేసి న్యాయాధికారి ఎదుట ప్రవేశపెట్టారు. 24 గంటల్లో చోరీ చేసిన నిందితుడ్ని పట్టుకుని, సొత్తును స్వాధీనం చేసుకున్న ఎస్ఐ రవికిరణ్, సిబ్బందిని సీఐ ఉపేంద్రరావు అభినందించారు.

నూర్పు చేస్తుండగా మంటలు చెలరేగి..

సారాడవలసలో ధాన్యం, ట్రాక్టరు దగ్ధం

మెంటాడ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సారాడవలసలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించి మూడు లక్షల రూపాయల ఆస్తినష్టం వాటిల్లింది. రైతు సారా రమణ మూడున్నరెకరాల వరిపంటను యంత్రంతో నూర్పుచేస్తుండగా, ట్రాక్టరు ఇంజిన్ వేడెక్కి మంటలు చెలరేగాయి. దీంతో ట్రాక్టరుతోపాటు ధాన్యం అగ్నికి ఆహుతయ్యాయి. ట్రాక్టరు, ధాన్యం కలిపి ఆస్తినష్టంమూడులక్షల రూపాయల వరకు ఉంటుందని అంచనావేశారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటతోపాటు ట్రాక్టరు దగ్ధమవడంతో బాధితుడు రమణ లబోదిబోమంటున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు

బొండపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ యు.మహేష్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని రోళ్లవాకలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఫైసర్ల పోలమ్మ తన భర్త సింహాచలంతో కలిసి ప్రభుత్వం గ్రామంలో ఇచ్చిన ఇంటి స్థలంలో పూరిపాక వేసుకొని నివసిస్తున్నారు. ఈనెల నాలుగో తేదీన ఉదయం తాళ్లపూడిపేట గ్రామానికి చెందిన తాళ్లపూడి ప్రకాష్, రమణ, గురినాయుడు యంత్రంతో పూరిపాక సమీపంలో గల మరుగుదొడ్డిని తొలగించారు. ఆ సమయంలో కులం పేరుతో దూషించి, దుర్భాషలాడినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదుచేశారు.

సాయన్న చానల్ అభివృద్ధే లక్ష్యం

రేగిడి, డిసెంబరు 15, (ఆంధ్రజ్యోతి): సాయన్నచానల్ అభివృద్ధితో పాటు, సాగునీటిసమస్యల పరిష్కరించడమే తన లక్ష్యమని సాయన్నచానల్ సంకిలి నీటి సంఘం అధ్యక్షుడు నారు జనార్దనరావు తెలిపారు. సంకిలి నీటిసంఘం అధ్యక్షుడుగా ఎన్నికైన ఆయన్ను టీడీపీ నాయకులు సన్మానించారు.

నేడు, రేపు సర్పంచ్‌లకు శిక్షణ

చీపురుపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సోమ, మంగళవారాల్లో అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎ. సరళ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకూ శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

రేపు పెన్షనర్ల దినోత్సవం

విజయనగరం రూరల్, డిసెంబరు 15, (ఆంధ్రజ్యోతి): జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని పెన్షనర్లసంఘ భవనంలో మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘంప్రతినిధులు పెద్దింటి అప్పారావు, జి.నారాయణ, వీఎస్ఆర్ నాయుడులు చెప్పారు. ఆదివారం విజయనగరంలోని పెన్షనర్ల సంఘ భవనంలో పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

●రాజాం,డిసెంబరు 15, (ఆంధ్రజ్యోతి): రాజాంలో అఖిలభారత ప్రభుత్వ పెన్షనర్ల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్ష కార్యదర్శులు నారాయణశెట్టి, గౌరీ శంకర్, డోల అప్పలనాయుడు తెలిపారు.

18న గ్రంధమహోత్సవాలు

విజయనగరం రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):విజయనగరంలోని కోట్లమాదప్ప వీధిలోగల దర్గా వద్ద ఈనెల 18న దరియాఖాన్ బాబా ఆవులియా గంధమహోత్సవాలు జరుగుతాయని దరియాఖాన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అన్వర్ భాషా, ఎం.ఖాన్, అజీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ దర్గాలో ప్రత్యేక కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

రేగిడిలో దివ్యజీవన సత్సంగం

రేగిడి, డిసెంబరు 15, (ఆంధ్రజ్యోతి):రేగిడి దత్తపీఠంలో దత్తగురువు కిమిడి సత్యానారాయణ అధ్యక్షతన ఆదివారం దివ్యజీవన సత్సంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొండకు చెందిన సత్యసాయి ప్రతినిధి ఎన్వీ రమణ, దత్తకన్వీనర్ ఆర్.శ్రీనివాసరావు ఆధ్యాత్మికప్రవచనాలు, రామాయణ, మహాభారతం, భగవద్గీతలోని ముఖ్యఘట్టాలపై చర్చ నిర్వహించారు.

180 మందికి వైద్య పరీక్షలు

లక్కవరపుకోట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లేపల్లి-రేగలో ఆదివారం విశం మంథా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అపోలో ఆసుపత్రి సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా 110 మంది సాధారణ జబ్బులు, 70 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 40 మందికి కళ్లజోళ్లకు అవ సరమని గుర్తించారు. కార్యక్రమంలో ఎంపీఎస్ నరసయ్య, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పెదమేడపల్లిలో నేత్ర వైద్య శిబిరం

మెంటాడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పెదమేడపల్లిలో ఆదివారం హిందూస్థాన్ షిప్‌యార్డ్ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ గీతాంజలి ఆధ్వర్యంలో 121 మందికి వైద్యపరీక్షలు చేసి ఆపరేషన్ అవసరమైన వారిని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు.కార్యక్రమంలో హెచ్ఎస్ఎల్ డైరెక్టర్ రాకేష్ ప్రసాద్, సీఎస్ఆర్ జీఎం ఛైర్మన్ శ్రీనివాసరావు, శంకర్ ఫౌండేషన్ జీఎం రాధాకృష్ణ, సర్పంచ్, పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

50 మందికి దుస్తుల పంపిణీ

మెంటాడ (ఆంధ్రజ్యోతి) డిసెంబరు 15: మెంటాడ గ్రామానికి చెందిన పాండ్రంకి సత్యనారాయణ (చిరంజీవి) ఆదివారం 50 మంది పేదలకు నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. వింత వ్యాధితో బాధపడుతున్న విద్యార్థిని కృష్ణవేణికి వైద్య ఖర్చులు నిమిత్తం రూ.ఆరువేలు అందజేశారు కార్యక్రమంలో రామమోహన్‌రావు, కృష్ణ, జనార్దన పాల్గొన్నారు.

ఐక్యతతో పార్టీని నడిపించాలి: మంత్రి కొండపల్లి

గంట్యాడ, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు ఐక్యంగా పార్టీని మరింత ముందుకు నడిపించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. ఆదివారం కొత్తవెలగాడ వద్ద మండల టీడీపీ అధ్వర్యంలోని కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి మంత్రి సామూహిక భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం నమోదులో కార్యకర్తలు మరింత పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలోని మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, నాయకులు పాల్గొన్నారు.

చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలి

రాజాం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పిల్లల చదువు విషయంలో ప్రత్యేక దృష్టిసారించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు కోరారు. రాజాంలోని తృప్తి రిసార్ట్సులో నిర్వహించి తూర్పుకాపుల వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. తూర్పుకాపుల సొంత భవనం నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, టీడీపీ జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, సురంగి మోహన్‌రావు, ఆబోతుల ప్రభాకర్‌రావు, వావిలపల్లి జగన్నాథనాయుడు, గార రవిప్రసాద్, గార సైలజ, శాసపు రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

వివాహానికి హాజరైన మంత్రి, ఎంపీ



వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

భోగాపురం, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమటాంరాయవలస సమీపంలో గల సన్‌రే రిసార్ట్సులో ఆదివారం వాజీ కేబుల్ ఎండీ శ్రీనివాస్ కుమారుడుకు వివాహం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతుబంగార్రాజు, కలెక్టర్ బీఆర్ అంబేద్కర్, నాయకులు, కుటుంబ సభ్యులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

దైవభక్తితో మానసిక ప్రశాంతత: కిమిడి



పూజలు చేస్తున్న కళావెంకటరావు

గరివిడి(మెరకముడిదాం), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి):ప్రతి వ్యక్తి దైవభక్తితో మానసికంగా ప్రశాంతత లభిస్తుందని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు తెలిపారు. ఆదివారం మెరకముడిదాం మండలంలోని గాదెల మర్రివలసలో పైడితల్లమ్మ వారి ఆలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దేవాలయాలు నెలకొల్పడం వల్ల మంచి వాతావరణం ప్రజల మధ్యన ఏర్పడతుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం స్పోర్ట్స్ మీట్: ఎస్పీ



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్పీ

డెంకాడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొంటున్న తీవ్రమైన పని, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించేందుకు బెటాలియన్ పోలీసులకు స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆదివారం చింతలవలసలోని ఏపీఎస్పీ ఐదో పోలీసు బెటాలియన్ పరేడ్‌గ్రౌండ్‌లో 36వ వార్షిక పోలీసు స్పోర్ట్సు అండ్ గేమ్సు మీట్ ముగింపు వేడుకలు నిర్వహించారు. వార్షిక క్రీడా పోటీల్లో ఐదో బెటాలియన్‌లోని వివిధ కంపెనీలకు చెందిన తొమ్మిది జట్లు స్పోర్ట్సు అండ్ గేమ్సు మీట్‌లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ మలికాగార్గ్ మాట్లాడుతూ బెటాలియన్ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు సోదరభావంతో మెలగా లన్నారు. స్పోర్ట్సు మీట్‌లో కంపెనీకి చెందిన సురేష్ వ్యక్తిగత చాంపియన్ షిప్, బి కంపెనీ జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించింది. ఈ సందర్భంగా వివిధ పోలీసులు జట్లు నిర్వహించిన మార్చ్‌పాస్ట్, ఏపీఎస్‌డీ ఆర్ఎఫ్ సిబ్బంది బైకులతో నిర్వహించిన సాహస విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన పోలీస్ సిబ్బందికి మెడల్స్, జ్ఞాపికలు, జట్లకు బహుమతులు, మెడల్స్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమాండెంట్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమాండెంట్ బాపూజీరావు, రమణమూర్తి, శ్రీనివాస్, గోపాలకృష్ణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు జి.రవీంద్ర, ఎం.శ్రీనివాసరావు, దానయ్య, నూకరాజు, దామోదర్, కేకేఎం రాజు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 5,345 కేసులు పరిష్కారం

విజయనగరం క్రైం,డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి):జిల్లాలో శనివారం నిర్వహించిన మెగా లోక్‌అదాలత్‌లో 5,346 కేసులు పరిష్కరించామని ఎస్పీ వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాది, ముద్దాయిల మధ్య సమన్వయం సాధించి ఇరువర్గాల అంగీకారంతో రాజీమార్గంలో పరిష్కరించామని పేర్కొన్నారు.రాజీఅయ్యేలా క్షేత్రస్థాయిలో కృషి చేసిన పోలీసుసిబ్బందిని, నిరంతరం పర్యవేక్షణ చేసిన అధికారులను ఎస్పీ అభినందించారు.

కూటమి ప్రభుత్వానికి మద్దతుగా ఉండాలి: కోండ్రు



రేగిడి: అమదాలవలసలో మాట్లాడుతున్న మురళీమోహనరావు

రేగిడి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గుంతలు లేనిరోడ్లను తీర్చిదిద్దేందుకు కుటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందుకు ప్రజలు మద్దతుగా ఉండాలని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు కోరారు. ఆదివారం అమదాలవలస -రేగిడి గ్రామాలకు పీఆర్ కింద మంజూరైన రూ.70 లక్షలతో బీటీ రోడ్డుపనులకు శంకుస్థాపన చేశారు. దేవుదళ, కొమిరి, లక్ష్మీపురం, అంబాడ తదితర గ్రామాల కార్యకర్తల కుటుంబాలను పరామర్శలతోపాటు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొమిరిలో జైభీమ్ యువజన సంఘం ఏర్పాటుచేసిన కార్య క్రమంలో అంబేద్కర్ విగ్రహాన్ని టీడీపీ నాయకుడు జగదీష్‌తో కలిసి ఆవిష్కరించారు. ఆయన వెంట రేగిడి, రాజాం టీడీపీ నాయకులు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, కర్నేన మహేష్, గిరడ సింహాచలం, గురవాన రమేష్, మజ్జి శ్రీనివాసరావు, ధనంజయ్, గొలివిందల శ్రీనివాసరావు, గురవాన నారాయణరావు, మద్దు హరి ఉన్నారు.

●రాజాం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో పంచాయతీ నిధులు రూ.13వేల కోట్లను దారి మళ్లించి గ్రామ పరిపాలనను నిర్వీర్యం చేశారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆరోపించారు. రాజాంలోని పాలకొండ రోడ్డులో ఎస్సీల వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.

శివారు ఆయకట్టుకు నీరందించాలి: కోళ్ల



శృంగవరపుకోట రూరల్: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న లలితకుమారి

లక్కవరపుకోట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): శివారు ఆయకట్టు వరకు నీరందించి రైతుల కల్లల్లో ఆనందం నింపాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పిలుపునిచ్చారు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్య క్షులు పనిచేయాలని కోరారు. ఆదివారం లక్కవరపుకోటలో నియో జకవర్గం పరిధిలో గల నీటి సంఘాల అధ్యక్ష ఉపాధ్యక్షుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. గెలుపొందిన అభ్యర్థులను రాంప్రసాద్, కరెడ్ల ఈశ్వరరావులతో కలిసి అభినందించారు. కార్యక్రమంలో కరెడ్ల శ్రీనివాసరావు, కాశీవిశ్వనాథ్‌రాజు పాల్గొన్నారు.

●శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నేటితరం విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేయాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. ఆదివారం శృంగవరపుకోట బాలికోన్నత పాఠశాల ఆవరణలో సుపథ ప్రతిభ పరీక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు దశాబ్దలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీహరీశర్మ, భాస్కరశర్మను అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు జీఎస్ నాయుడు, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు బర్మాకాలనీ సాయిరాం, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెక్కా కిరణ్, చెల్లయ్య పాల్గొన్నారు.

వీఆర్వోల తీరు మార్చుకోవాలి

బొండపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వీఆర్వోలు పనితీరుమార్చుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ చల్లా చలంనాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరారు. ఆదివారం ఎంపీపీ చలంనాయుడు అధ్యక్షతన స్థానిక మండల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మూటేషన్లుకు సంబంధించి అన్నిపత్రాలు సక్రమంగా ఉన్నా వీఆర్వోలు ఆన్‌లైన్ ఫైళ్లను రిజెక్ట్ చేస్తున్నారని, దీంతో రైతులు ఇబ్బందిపడుతున్నారని ఎంపీపీతోపాటు ముద్దూరు సర్పంచ్ మునకాల పైడిపునాయుడు తహసీల్దార్ రాజేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. నాలుగు పంచాయతీల పరిధిలో జేఎల్ఎంలులేక విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉండడంతో నియమించాలని ఎలక్ట్రికల్ జేఈ శంకరరావు దృష్టికి పలువురు సభ్యులు తీసుకువచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, ఎంపీడీవో గిరిబాల,తులసీరాం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నగర పంచాయతీ అభివృద్ధికి కృషి

నెల్లిమర్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని,గాంధీనగర్ కాలనీ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని టీడీపీ నెల్లిమర్ల మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ తెలిపారు. గాంధీనగర్ కాలనీలో ఖాళీ స్థలం చుట్టూ ప్రహరీనిర్మించేందుకు ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొంత నిధులతో ఖాళీ స్థలాన్ని అభివృద్ధిచేస్తానని, ప్రహరీ గోడ నిర్మిస్తే ఆక్రమణలకు తెరపడుతుందని, శుభ కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజినితో పాటు టీడీపీ నాయకులు లెంక అప్పలనాయుడు, మజ్జి ఆదినారాయణ, బయిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి, కరకవలస కృష్ణారావు,బూసురోతు శ్రీను,వెంకటేష్ పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

నెల్లిమర్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో చెరువుగర్భం ఆక్రమణ స్థలాన్ని రెవెన్యూఅధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. చెరువు గర్భంలో సుమారు రెండుసెంట్ల స్థలాన్ని ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్న విషయం తెలుసుకున్న తహసీల్దార్ బి.సుదర్శనరావు ఆ ఆక్రమణలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో వీఆర్వో సౌజన్యతోపాటు సర్వేయర్ తుమ్ము అశోక్ ఆ స్థలంలో ఏర్పాటుచేసిన పునాదులను ఆదివారం యంత్రంతో పెకిలించి, హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేశారు. ఈ స్థలాన్ని తహసీల్దార్ సుదర్శనరావుతో పాటుగ్రామ పెద్దలు అవనాపు సత్యనారాయణ, ఎం.ఎం.నాయుడు, నల్లి బంగారు చంద్రశేఖర్,పాండ్రంకి సత్యనారాయణ, తుమ్ము వెంకటరమణ,ఆర్ఐ వేణు పరిశీలించారు. అనంతరం నెల్లిమర్లలోని సాయి సుభద్ర సినిమా థియేటర్‌ను తహసీల్దార్ తనిఖీచేశారు.

ఘనంగా ఘంటసాల ఆరాధనోత్సవాలు



ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల అంటే ఓ 'భగవద్గీత'. ఆయన శ్లోకాలు చెప్పి తత్వార్యం చెబుతుంటే ఆ కృష్ణభగవానుడే స్వయంగా బోధించేలా ఉంటుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. స్థానిక ఎన్జీవో హోంలోని రిక్రియేషన్ క్లబ్‌లో కబీర్‌షా ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 26వ ఘంటసాల ఆరాధనోత్సవాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఘంటసాల, కబీర్‌షా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టణంలోని సంగీత పాఠశాలకు పూర్వ వైభవం వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఎన్జీవో హోంలో ఉన్న రిక్రియేషన్ క్లబ్‌ను కూడా ఆధునికీకరణ చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్వరాంజలి సంగీత ఆర్కెస్ట్రా వారిచే నిర్వహించిన సంగీత విభావరిని మంత్రి తిలకించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ జర్జాపు ఈశ్వరరావు, నిర్వాహకులు రాంప్రసాద్, డాక్టర్ ఫణేశ్వరరావు, జర్జాపు సూరిబాబు, నిమ్మాది చిట్టి, పిన్నింటి ప్రసాద్, పరమేష్, ముఖీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే బకాయిలు చెల్లించాలి

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ వర్క్‌షాపులో పనిచేస్తున్న ఉద్యోగులకు తక్షణమే బకాయిలు చెల్లించాలని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. ఆదివారం విజయనగరంలోని ఏపీటీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో జిల్లా, జోన్, నాన్ ఆపరేషన్, రీజియన్ నాయకులతో రీజినల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రొడక్షన్ యూనిట్‌లో 100 శాతం టీఎల్ తీసుకురావాలని జీవోలో పొందుపరిచినా, 120పైబడి పీఎల్ తేవాలని ఉద్యోగులపై ఒత్తిడి చేస్తున్నా సకాలంలో స్పేర్ పార్టులు మాత్రం సప్లయ్ చేయలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు భానుమూర్తి, అప్పలరాజు, పెదమజ్జి సత్యనారాయణ, చింతాడ వెంకటరావు, ఎర్రంనాయుడుతో పాటు వర్క్‌షాపు టీఆర్‌ఎస్, స్టోర్స్, క్లరికల్ విభాగానికి చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

గజపతినగరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యా రంగ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సంఘ మండల మహాసభలను పురస్కరించుకుని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. వసతి గృహాల్లో సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కాగా 12 మందితో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సోమేష్, అధ్యక్షులుగా పి.గౌరి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా సహాయకార్యదర్శి కె.జగదీష్ పాల్గొన్నారు.

జనరల్ బోగీలతో రైళ్లు నడపాలి

బొబ్బిలి/బొబ్బిలి రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాన నగరాల్లో పేదలు నిత్యం రైళ్లలో ఎంత దుర్భరమైన ప్రయాణం చేస్తున్నారో ప్రజాప్రతినిధులకు పట్టడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి.శంకరరావు అన్నారు. ఆదివారం బొబ్బిలిలో ఆయన మాట్లాడారు. ప్రధాన నగరాలైన హైదరాబాదు, చెన్నయ్ నుంచి విశాఖపట్నం మీదుగా వచ్చే ట్రైన్లులో రెండే జనరల్ బోగీలు పెడుతున్నారన్నారు. ఈ బోగీల్లో 500 నుంచి 1000 మంది దాకా కిక్కిరిసి ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. జనరల్ బోగీలతో పట్టణాలకు ట్రైన్లు వేయాలని సీపీఎం తరపున డిమాండ్ చేస్తున్నానని ఆయన తెలిపారు. జనరల్ బోగీలతో ప్రధాన పట్టణాలకు ట్రైన్స్ వేయాలని పోరాటం చేస్తున్న సీపీఎంతో కలిసి ప్రజలందరూ రావాలని విజ్ఞప్తి చేశారు.

హెల్త్ అసిస్టెంట్లను కొనసాగించాలి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 15: రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలో హెల్త్ అసిస్టెంట్లను కొనసాగించి ఉద్యోగ భద్రత కల్పించాలని యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కె.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఆదివారం కేఎల్‌పురంలోని ఎన్‌పీఆర్ భవనంలో సీఐటీయూ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో లక్ష్మణరావు మాట్లాడుతూ 22 ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్న హెల్త్ అసిస్టెంట్లను కోర్టు తీర్పు పేరుతో తొలగించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధి జీవీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

దేశసేవకు ముందడుగు వేయడం అభినందనీయం



ఎమ్మెల్యే బేబీనాయనను కలిసిన సైనిక దళాలకు ఎంపికైన యువత

బొబ్బిలి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సైనికదళాలకు ఎంపికైన యువతను బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్వీఎస్‌కేకే రంగారావు (బేబీ నాయన) అభినందించారు. బీఎస్ఎఫ్, సీఎస్ఎఫ్, అస్సాం రైఫిల్స్, సీఆర్పీఎఫ్ దళాలకు ఎంపికైన ఆరుగురు యువకులు ఆదివారం ఆయన్ని కలిశారు. ఈసందర్భంగా ఆయన వారిని అభినందించారు. దేశసేవకు ముందడుగు వేయడం అభినందనీయమన్నారు. యువత సైనిక దళాలకు ఎంపికయ్యే విధంగా ఉచిత శిక్షణ ఇస్తున్న రావు శ్రీనివాసరావును ఆయన కొనియాడారు.

వీర సైనికుడికి నివాళి



నివాళులు అర్పిస్తున్న మాజీ సైనికులు

బొబ్బిలి/బొబ్బిలి రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మూ-కాశ్మీర్‌లో లైన్ ఆఫ్ కంట్రోల్ వద్ద ఇటీవల ల్యాండ్ మైన్ బ్లాస్ట్‌లో వీర మరణం పొందిన ప్రకాశం జిల్లాకు చెందిన హవల్దార్ వి.సుబ్బయ్యకు బొబ్బిలి మాజీ సైనికులు నివాళులు అర్పించారు. ఈ మేరకు ఆదివారం పాతకోటలో గల మాజీ సైనిక సంక్షేమ సంఘం కార్యాలయ ఆవరణలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, 2 నిమిషాలు మౌనం పాటించారు. మాజీ సైనిక సంఘం అధ్యక్షులు రేవళ్ల కిరణ్‌కుమార్, రెడ్డి రామకృష్ణ, ఎ.గోవిందనాయుడు, ఎస్ఆర్ మోహనరావు, సీహెచ్ డేవిడ్, ఎంఎల్ రావు, పి.సురేష్‌బాబు, సీహెచ్ త్రివేది పాల్గొన్నారు.

కృష్ణ సాగరం అభివృద్ధికి చొరవ చూపాలి

గరుగుబిల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణ సాగరం చెరువు అభివృద్ధికి చొరవ చూపాలని వల్లరిగుడబ సర్పంచ్ రౌతు గోవిందనాయుడు కోరారు. ఆదివారం వల్లరిగుడబ గ్రామంలో ఆయన ఎన్నికైన నీటి సంఘ ప్రతినిధులను అభినందించారు. భారీ విస్తీర్ణంలో ఉన్న చెరువులకు పలు ప్రాంతాల్లో స్లూయిస్‌లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఊడుగు గోవిందనాయుడు, రౌతు పోలినాయుడు, బి.సింహాచలం, ఆర్.సాంబమూర్తి, జి.కృష్ణంనాయుడు, వి.సింహాచలం పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జీవితం స్ఫూర్తిదాయకం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అమరజీవి వర్ధంతి
- నివాళులు అర్పించిన నాయకులు, అధికారులు

అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల వ్యాప్తంగా పలు ప్రభుత్వ కార్యాలయాలు, కూడళ్లలో కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధన కోసం ఆమరణ దీక్ష చేపట్టి ప్రాణాలర్పించి అమరజీవిగా నిలిచిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు, పోలీసులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



పార్వతీపురం: ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పిస్తున్న ఏపీవో మురళీధర్



విజయనగరం క్రైం: పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులు అర్పిస్తున్న ఏఎస్పీ నాగేశ్వరరావు



బొబ్బిలి: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బాధ్యతగా వ్యవహరించాలి

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి



సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గరుగుబిల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సూచించారు. ఆదివారం ఉల్లిభద్ర సమీపంలోని ఎర్రన్నగుడి సముదాయంలో సాగునీటి ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, మెంబర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజక వర్గం పరిధిలోని ఐదు మండలాల్లో కూటమి ప్రభుత్వానికి చెందిన వారే విజయం సాధించారని చెప్పారు. రైతుల సమస్యలను గుర్తించడంతో పాటు కాలువల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. నియోజకవర్గంలోని సమస్యలను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసు కువెళ్లామని ఆమె తెలిపారు. తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో అదనపు ఆయకట్టుకు, అలాగే వట్టిగెడ్డకు సంబంధించి అవసర మైన నిధులకై కృషి చేస్తున్నామన్నారు. జంఝావతి ప్రాజెక్టుకు సంబంధించి లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లామని చెప్పారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.మధుసూదనరావు, పార్టీ ప్రతినిధులు ఎం.తవిటి నాయుడు, డి.సత్యనారాయణ, ఎ.రాంబాబు, కె.భరత్‌కుమార్, ఎంటీ విజయవాంకుశం, ఎ.గంగాధర్ నాయుడు, ఎం.సింహా చలంనాయుడు, డి.ధనుంజయరావు, బి.నారాయణస్వామి, పూర్ణచంద్రరావు, నాగావళి కుడి, ఎడమ కాలువల నీటి సం ఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు పి.పాపినాయుడు, కె.బలరాం నాయుడు, జి.శీతంనాయుడు, డి.శంకరరావు పాల్గొన్నారు.

ఏజెన్సీలో పర్యాటకుల సందడి

సీతంపేట రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని ఆడలీ వ్యూ పాయింట్, మెట్టుగూడ జలపాతం, ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. రోజంతా ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. పార్క్‌లోని సాహస క్రీడల్లో పాల్గొన్నారు.



సాలూరు రూరల్: గాలిగబదారు జలపాతం వద్ద..



హ్యాంగింగ్ బ్రిడ్జ్‌పై నడుస్తున్న పర్యాటకులు

- సాలూరు రూరల్: సాలూరు ఏజెన్సీలో ఉన్న జలపాతాల వద్ద పర్యాటకుల రద్దీ తగ్గడం లేదు. సాలూరు మండలంలో దళాయివలస రాందారి, లొద్ద హనుమబారి జలపాతం, శిఖపరువు గోముఖి జలపాతాల వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఏవోబీలో సాలూరు మండలం కొఠియా గ్రూప్‌లో ఉన్న గాలిగబదారు జలపాతం వద్ద పర్యాటకులు పెద్దసంఖ్యలో వచ్చారు.

మాస్టర్ ట్రైనీలకు దరఖాస్తు చేసుకోవాలి

గరుగుబిల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సుందర పార్వతీపురంపై అవగాహన కల్పించేందుకు నియమిస్తున్న మాస్టర్ ట్రైనీల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో జి.పైడితల్లి, ఏవో ఎన్.అర్జునరావు తెలిపారు. ఆదివారం వీరు విలేకర్లతో మాట్లాడారు. 30 మంది ట్రైనీలు అవసరం ఉందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండి, 35 సంవత్సరాలలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

అందుబాటులో ఐవీఎఫ్ సేవలు

బెలగాం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో ఐవీఎఫ్ సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఆదివారం జయశ్రీ ఆసుపత్రి ఎదురుగా ప్రముఖ వైద్యులు యాళ్ల వివేక్, యాళ్ల పద్మజ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కుటుంబ ఐవీఎఫ్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. సంతాన సాఫల్యంనకు సంబంధించిన వైద్య పరీక్షలు, స్కానింగ్ ఈనెల 21 వరకు ఉచితంగా అందిస్తామని వివేక్ చెప్పారు. వైద్యులు యాళ్ల ధీరజ్, పైల రాణిరోజా, దీపక్ వంశీ పాల్గొన్నారు.

అమ్మవారికి స్వర్ణ పుష్పాలు విరాళం

పాలకొండ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పాలకొండ శ్రీకోటదుర్గమ్మ అమ్మవారికి 365.800 మిల్లీ గ్రాముల బరువు గల స్వర్ణ పుష్పాలు, వెండి స్టాండ్, వెండి అమ్మవారి విగ్రహాన్ని దాతలు విరాళంగా ఇచ్చారు. విరాళంగా ఇచ్చిన 108 స్వర్ణ పుష్పాల కు దేవాలయ ఉప ప్రధానార్చకులు శ్రీదార్లపూడి లక్ష్మీ ప్రసాద్ పుష్పార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 116 మంది దంపతులకు దేవస్థానం తరపున శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. పల్లా కొండబాబు, ఎన్.రమేష్ సహాయంతో అన్నదానం నిర్వహించారు.



దాతలు అందజేసిన స్వర్ణ పుష్పాలు

ఈ-దోపిడీ

(ఐదో పేజీ తరువాయి)

స్టాంపుల ఖరీదుతో కలిపి వందలు ఒక్కోసారి వేలరూపాయలు కూడా గుంజేస్తున్నారు. వీరి అవగాహన రాహిత్యం వల్ల దస్తావేజుల్లో తప్పులు దొర్లి అనేక వివాదాలు, గొడవలు జరుగుతున్నాయి. కొన్నిసార్లు ఇవి పెరిగి పెద్దవైనప్పుడు శాంతిభద్రతల సమస్యకూ వీరు ప్రత్యక్షంగా కారణమవుతున్నారు. అధికారులు తెలియనట్టు వ్యవహరిస్తున్నారు.

అదనపు ధరకు అమ్మితే చర్యలు..

స్టాంపులను అదనపు ధరకు అమ్మితే చర్యలు తప్పవు. వినియోగదారులు ఫిర్యాదు చేస్తే వెంటనే విచారణ చేపట్టి లైసెన్స్ రద్దుచేస్తాం. అనధికారిక డాక్యుమెంటేషన్ కూడా నేరమే. నాన్ జ్యుడీషియల్ స్టాంపులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులో వున్నాయి. ఈ-స్టాంపులు లేదా ఎన్‌జె స్టాంపులలో దేంతోనైనా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు.

- నాగలక్ష్మి, జిల్లా రిజిస్ట్రార్, విజయనగరం

త్వరలో ఆకస్మిక తనిఖీలు..

ఈ-స్టాంపులు ఎక్కువ రేటుకు విక్రయిస్తే బాధితులు తక్షణమే మాకు ఫిర్యాదు చేయవచ్చు. వెంటనే విచారణ జరిపిస్తాం. సస్పెండ్ లేదా లైసెన్స్ రద్దు చేస్తాం. ఈ-స్టాంపులు అమ్మిన వెండర్‌కు కమీషన్ ఇస్తాం. అదనపు వసూళ్లు చేయకూడదు. త్వరలో జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేపడతాం.

-అమిత్ జైస్వాల్, ఏరియా మేనేజర్, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, విశాఖపట్నం.

హామీలు నెరవేర్చడంలో విఫలం

రామభద్రపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ ఒక్క నోటిఫికేషన్ కూడా వేయడం లేదన్నారు. సూపర్‌సిక్స్ అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. రైతు భరోసా ఊసేలేదన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, తదితర అంశాలపై విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు లెంక లక్ష్మి, కామిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకే తిక రంగాల్లో రాణించాలని డీఈవో యు.మాణిక్యం నాయుడు కోరారు. విజయనగరంలోని బాబామెట్టలో కేంద్రీయ విద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దిలీప్ మోదీ, హెచ్ఎం ప్రవీణ్‌మళ్లా, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

వాహన పత్రాలు తప్పనిసరి



కురుపాం: అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

కురుపాం రూరల్, డిసెంబరు15 (ఆంధ్ర జ్యోతి): ప్రతి వాహనదారుడు తన వాహనా నికి సంబంధించిన పత్రాలను దగ్గర ఉంచుకోవాలని కురుపాం ఎస్ఐ నారాయణరావు సూచించారు. ఈ మేరకు ఆయన ఆదివారం మూలిగూడ జంక్షన్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు. ● కురుపాం: వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటిం చాలని కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు కోరారు. ఆదివారం కురుపాంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అనంతరం వాహన దారులకు అవగాహన కల్పించారు.

పుస్తక పఠనంతో మానసిక వికాసం

ఒడిశా

రాయగడ, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): మానసిక వికాసానికి పుస్తక పఠనం మంచి ఔషధమని ప్రముఖ సాహితీవేత్త తరుణీకాంత్ మిశ్రా అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ యూజీఎంబీటీ కళాశాల ప్రాంగణంలో జరిగిన సాహితీ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా సబ్‌కలెక్టర్ కళ్యాణి సంఘమిత్ర దేవి పాల్గొని, మాట్లాడారు. ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం సభలో 'శబ్దరాగం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దుష్యంత్ కుమార్ మహంతి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సాహితీవేత్తలు లావణ్యసబర్, బెంగాలినందో, సుశాంత్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఏజెన్సీలో తగ్గిన ఉష్ణోగ్రత

కురుపాం, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో ప్రజలు చలితో వణుకుతున్నారు. ఏజెన్సీ ముఖ ద్వారమైన కురుపాంలో ఆదివారం తెల్లవారు ఝామున ఉష్ణోగ్రత 13 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. ఏజెన్సీ అంతటా మంచు కమ్ముకుని అరకు వ్యాలీ ఉండే వాతావరణాన్ని తలపించింది.

గుంతల పూడ్చివేత

బాడంగి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): బాడంగి ఎత్తుఖానా వద్ద ఏర్పడిన గోతులను డొంకినవలసకు చెందిన యువత ఆదివారం పూడ్చారు. ఇటీవల ఈ ప్రాంతంలో గోతుల కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో డొంకినవలస యువత స్పందించి ఈ గుంతలను పూడ్చారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

బొబ్బిలి/బొబ్బిలి రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. టౌన్ సీఐ కటకం సతీష్ ఆధ్వర్యంలో ఆదివారం బొబ్బిలిలో గల లారీ, టాక్సీ, ఆటో యూనియన్ల సభ్యులందరికీ ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని ఆయన సూచించారు. ఎస్ఐ జ్ఞానప్రసాదు, ఆర్.రమేష్, పోలీస్ సిబ్బంది, లారా, టాక్సీ, ఆటో యూనియన్ల సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే మద్యాన్ని విక్రయించాలి

బొబ్బిలి రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాల్టీ పరిధిలో గల బార్లు, మద్యం దుకాణాలను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ ఆర్.శ్రావణకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం తనిఖీ చేశారు. అన్ని దుకాణాల్లో ఎమ్మార్పీకే మద్యం అమ్ముతున్నారని ఎస్ఐ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

విజయనగరం క్రైం, డిసెంబరు 15: (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ సూచించారు. ఆదివారం వన్‌టౌన్ పరిధిలోని అయ్యన్నపేటలో గ్రామ సందర్శనలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ నెంబర్లకు స్పందించవద్దన్నారు. ఎస్ఐ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల దహనం

పాలకొండ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దుచేయాలని, స్మార్ట్ మీటర్లు ఆపాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సింగన్న వలస పంచాయతీ పరిధిలోని మల్లంగూడ గ్రామంలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల సభ్యుడు ఎ.భానుచందర్, నాయకులు చెంప, సాంబ య్య చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

జీసీటీఏ కార్యవర్గ సభ్యుడిగా సత్యనారాయణ

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 15: (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక సంఘం(జీసీటీఏ) కార్యవర్గ సభ్యుడిగా ఆర్.సత్యనారాయణ ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యాపక సంఘం అధ్యక్షుడిగా రెడ్డి ఉమామహేశ్వరరావు, సభ్యుడిగా సత్యనారాయణలు ఎన్నికయ్యారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ రేఖతో పాటు అధ్యాపకులు అభినందించారు.

అంతర పంటలతో లాభాలు

లక్కవరపుకోట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతులు అంతర పంటల ద్వారా అధిక లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎం.ఆనందరావు తెలిపారు. ఆదివారం చందులూరు, లింగంపేట యూనిట్లలో పర్యటించారు. ఈసందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు.